క్లుప్తంగా

నేడు క్విజ్ పోటీలు

ఆదిలాబాద్‌టౌన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఆధ్వర్యంలో మంగళవారం నుంచి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు లీడ్‌బ్యాంక్ మేనేజర్ భాస్కర్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక అక్షరాస్యతలో ఆర్బీఐ పాత్ర అనే అంశంపై పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 27 నుంచి జూలై 10 వరకు కొనసాగుతాయన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

ఆదిలాబాద్: యువత మత్తుకు దూరంగా ఉండాలని ఏఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐసీడీఎస్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సోమవారం మిషన్ ఆన్ పరివర్తన్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్తు పదార్థాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డీసీపీవో రాజేంద్రప్రసాద్, సీఐలు సత్యనారాయణ, గుణవంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఆసిఫాబాద్ కుమురం భీం జిల్లా పర్యటనకు వెళ్తున్న రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ మంత్రి గోడం నగేశ్‌ను ఉట్నూర్ మండలంలోని బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. గిరిజనేతరుల పోడు భూముల అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీపీ జైవంత్‌రావు, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరామ్, జిల్లా నాయకులు దాసండ్ల ప్రభాకర్, ధరణి రాజేశ్, సతీశ్, స్వామి, నరేందర్, కిషోర్ పాల్గొన్నారు.

'పోరాటం ఫలితంగానే రేషన్‌షాపు మంజూరు'

బేల: యూత్ కాంగ్రెస్ పోరాటంతోనే హేటి గ్రామానికి రేషన్‌షాపు మంజూరైందని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. హేటి ప్రజలకు దూరంగా ఉన్న బాదిలో రేషన్‌షాపు వెళ్లి సరుకులు తీసుకురావడాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో రేషన్ షాప్ మంజూరైందన్నారు. మండల అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్, గుండవార్ సంజయ్, అఖిల్, అవినాష్, కృష్ణ, చంద్రకాంత్ పాల్గొన్నారు.

కప్పతల్లి ఆట

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామంలో వర్షాలు కురవాలని గ్రామస్తులు సోమవారం కప్పతల్లి ఆటఆడారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, పిల్లపాపలతో చల్లగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు కేదరేశ్వర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన గోడ

నార్నూర్: మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలచ, కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం ఆరు నెలల క్రితమే పూర్తయింది. అయితే ప్రహరీ నాసిరకంగా నిర్మించడంతో రెండు రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షానికి కూలిపోయింది. దీంతో పక్కనే ఉన్న రాథోడ్ దేవికాబాయి, రాథోడ్ సికిందర్‌కు చెందిన పొలంలో పత్తి విత్తనాలు కొట్టుకుపోయాయని వాపోయారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో గోడ కూలిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మహిళల రక్షణ కోసమే షీటీం

ఇంద్రవెల్లి: మహిళలు, యువతుల రక్షణ కోసమే షీటీం పని చేస్తోందని షీటీం ఇన్‌చార్జి కమల అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎలాంటి అన్యాయం, అఘాయిత్యం జరిగినా.. వెంటనే 100కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో షీటీం సిబ్బంది భాగ్యశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

నేరడిగొండ: పిల్లలకు ప్రీస్కూల్ విద్య అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. సోమవారం మండలంలోని దర్బతండా, వడూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలకు, 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డుపై దిగబడిన ఆర్టీసీ బస్


మట్టిలో దిగబడిన ఆర్టీసీ బస్

తలమడుగు: మండలంలోని డోర్లీ, కప్పర్‌దేవి గ్రామాల సమీపంలో రోడ్డు పనులు సాగుతున్నాయి. ఈ క్రమంలో ఆదిలాబాద్ నుంచి ఉమ్రికోసాయి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్ మట్టిలో దిగబడింది. దీంతో ప్రయాణికులు గంటసేపు రోడ్డుపైన పడిగాపులు కాశారు. రోడ్డు సరిగా లేకపోవడంతో ఆదిలాబాద్ నుంచి కోసాయి వెళ్లే ఆర్టీసీ బస్ సర్వీస్‌లను రవాణా శాఖ అధికారులు రద్దు చేశారు. దీంతో ప్రజలు ప్రైవేటు వాహనాలలో తరలివెళ్లారు.

కేజీబీవీ భవనం పూర్తయ్యేనా?

- రెండేళ్లుగా కొనసాగుతున్న పనులు
- సొంత భవనం లేక విద్యార్థుల తిప్పలు
- పట్టించుకోని అధికారులు


అసంపూర్తిగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ భవన నిర్మాణ పనులు రెండేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారుల అలసత్వంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం భీంపూర్ మండలానికి సంబంధించిన కేజీబీవీ విద్యాలయం జిల్లా కేంద్రంలో డైట్ కళాశాల హాస్టల్‌కు సంబంధించిన తాత్కాలిక భవనంలో కొనసాగుతోంది. ఇందులో విద్యార్థులకు సరైన వసతులు లేక, సొంత భవనం నిర్మాణం పూర్తికాక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం విద్య వ్యవస్థను బలోపేతానికి ప్రాధాన్యమిస్తున్నట్లు చెబుతున్నా.. అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టడం లేదు.

రూ.3.5 కోట్లు మంజూరు..

భీంపూర్ మండల కేంద్రంలో 2016– 17 సంవత్సరంలో ప్రభుత్వం కేజీబీవీ ఏర్పాటు చేసింది. స్థానికంగా మండల కేంద్రంలో సొంత భవనం లేక కేజీబీవీ విద్యాలయాన్ని జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలకు సంబంధించిన హాస్టల్‌లో కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం 310 మందికి పైగా బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి సరైన వసతులు లేవు. బెస్‌మెంట్ లెవల్ వరకు పనులు పూర్తిచేసి పిల్లర్లను నిర్మించి అలాగే వదిలేశారు.

ఇతర కాంట్రాక్టర్‌కు పనులు..

సకాలంలో భవన నిర్మాణ బిల్లులు రాకపోవడంతో పాటు భవన నిర్మాణం ప్రభుత్వం చెల్లించే డబ్బులతో గిట్టుబాటు కాదని కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు వదిలేశాడు. దీంతో గత ఆరు నెలలకు పైగా పనుల్లో పురోగతి లేక భవన నిర్మాణం పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. అధికారులు కాంట్రాక్టర్‌తో ఒప్పందం రద్దు చేసుకొని ఇతర కాంట్రాక్టర్‌కు నిర్మాణ పనులు అప్పగించారు. రెండోసారి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కూడా నత్తనడకన పనులు చేపట్టడంతో నేటికి పూర్తికాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవన నిర్మాణం వెంటనే పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

భవన నిర్మాణం పూర్తి చేయాలి

భీంపూర్ మండల కేంద్రంలో నిర్మిస్తున కేజీబీవీ భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి. తాత్కాలిక భవనంలో విద్యార్థులకు సరిపడా వసతులు లేవు. సమస్యలను ఇప్పటికే ఉన్నతాధికారులకు విన్నవించాం.

– రమ్య, కేజీబీవీ ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి, భీంపూర్



బోథ్: మండలంలోని సొనాల గ్రామంలోని ప్రధాన రోడ్డు చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది. ఆదివారం కురిసిన వర్షానికి చిత్తడిగా మారడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వర్షాలు అధికంగా కురిస్తే కనీసం నడవలేని పరిస్థితి నెలకొంటుందని వాపోయారు. బీటీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఇంద్రవెల్లి: మండలంలోని దనోరా(బి) గ్రామానికి చెందిన కుడ్మేత జంగుబాయిపై అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కాంబ్లే బాలాజీ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ముత్నూర్ గ్రామంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఇలాంటి ఘటనలు జరకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఖానాపూర్ డివిజన్ బాధ్యులు కాంబ్లే రాంప్రసాద్, ఇంద్రవెల్లి మండల అధ్యక్షుడు గజ్జారే బాలాజీ, వాగ్మారే రామారావ్, రామేశ్వర్, నాందేవ్, బాలాజీ పాల్గొన్నారు.

ఇచ్చోడ: గిరిజన మహిళపై అత్యాచారం చేసి, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సేన రాష్ట్ర నాయకులు కుంర కోటేశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో కుమురం భీం భవనంలో మాట్లాడారు. ఇంద్రవెల్లి మండలంలోని దనోరా(బి) శివారులో అమాయక గిరిజన మహిళను హత్య చేశారని, నిందితులను ఉరి తీయాన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సమావేశంలో ఆదివాసీ జేఏసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు అత్రం రవీందర్, విఠల్, చాహకటి రమేశ్, మాడావి భీంరావు, అత్రం గంగారాం పాల్గొన్నారు.

విప్లవాత్మక మార్పులకు మోదీ శ్రీకారం


మాట్లాడుతున్న సుహాసిని రెడ్డి

ఆదిలాబాద్: దేశంలో విప్లవాత్మక మార్పులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీనగర్‌కాలనీలో సోమవారం సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. దేశ అభివృద్ధే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ముందుకు సాగుతున్నారన్నారు. కోవిడ్ సమయంలో 80 కోట్ల మందికి ఉచిత రేషన్ పంపిణీ చేశారని, నిరుపేదలకు బ్యాంకింగ్ సేవలను అందజేసేలా జన్‌ధన్ పథకాన్ని ప్రారంభించారని వివరించారు. వెంకట్ రెడ్డి, సంతోశ్, ముఖీమ్, కాంత, అశాంత్, పవన్, శివకిరన్, రోహిదాస్ పాల్గొన్నారు.

బీజేపీతోనే సుభిక్షమైన పాలన..

బీజేపీ అధికారంలోకి వస్తే సుభిక్షమైన అందుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వడ్డెర కాలనీ, ఇందిరానగర్ కాలనీల్లో ఆదివారం మాట్లాడారు. బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్నకు నాలుగుసార్లు అవకాశం ఇచ్చినా.. నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదని స్పష్టం చేశారు. నాసిరకపు పనులతో కమీషన్లు తీసుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు రత్నాకర్ రెడ్డి, ధోని జ్యోతి, నరేశ్, శరత్, రాకేశ్, ప్రభు, సాయి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యం

తాంసి: దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. సోమవారం కరంజి, గోముత్రి, కరన్‌వాడీ, అంతర్గాం గ్రామాల్లో పర్యటించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని కోరారు. అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రధానమంత్రి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాకేశ్, దేవారెడ్డి, నారాయణ, రెడ్డివార్ రమేశ్, అంకం అశోక్, ప్రవీణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'

బేల/బోథ్/తలమడుగు/తాంసి: విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బేల, బోథ్, తలమడుగు, తాంసి తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. ప్రతీనెల ఒకటో తేదీన పెన్షన్ వచ్చేటట్లు చూడాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విశ్రాంత ఉద్యోగులకు కనీసం రూ.30 వేలను అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఇచ్చోడ: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసకోవావాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగారం రమేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం విద్య సంస్థల బంద్ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవో ఉదయ్‌రావుకు అందచేశారు. ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ రాథోడ్ అజయ్‌కుమార్, నగర సంయుక్త కార్యదర్శి సాయివివేక్, శ్రీనివాస్, రవితేజ పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పాఠశాలల బంద్ సంపూర్ణమైంది. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఓంప్రకాష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రేసు మనోజ్‌రెడ్డి, నార్లవార్ అజయ్, పవన్‌రెడ్డి, ప్రీతం, సాయిరెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

బోథ్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చారు. బోథ్‌తో పాటు కౌట పాఠశాలను బంద్ చేయించారు. పుస్తకాలతో పాటు యూనిఫామ్‌లను విద్యార్థులకు అందించాలని, తరగతులకు సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు.

'రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోం'


జొన్న పంటను పరిశీలిస్తున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ హెచ్చరించారు. సోమవారం ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జొన్న కొనుగోళ్లలో లేనిపోని కొర్రీలు పెట్టి ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు రత్నాకర్ రెడ్డి, జ్యోతి, ముకుంద్‌రావు, నరేష్, శరత్ ఉన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణకు పెద్దపీట

ఆదిలాబాద్: ప్రధాని నరేంద్రమోదీ సనాతన ధర్మ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రం నుంచి అమర్నాథ్ యాత్రకు వెళ్తున్న భక్తుల ప్రత్యేక బస్సుకు శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామితో కలిసి పూజలు చేశారు. భక్తులు జిల్లా కేంద్రం నుంచి అమర్నాథ్ యాత్రకు వెళ్లడం అభినందనీయమన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్‌లో బిల్లులు వెంటనే చెల్లించాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహాన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని వినాయక్ చౌక్ శిశుమందిర్‌లో ఆదిలాబాద్ అర్బన్ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. డీఏ బకాయిలను సీపీఎస్ ఉద్యోగులకు 17 విడతలుగా చెల్లింపు ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. నూతన పీఆర్సీ కమిటీని తక్షణమే నియమించాలని, ఉపాధ్యాయ ఖాళీలను గుర్తించి, డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజు గోపికృష్ణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తాత్రి ముండే, గాండ్ల అనిల్, కేశవ్, గోపాల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నేరడిగొండ: బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని కొరటికల్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో నెలకొన్న ప్రజా సమస్యలను అడిగి తె లుసుకున్నారు. అలాగే దర్యావ్ సింగ్ మహారాజ్‌ను కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. సీఎం కేసీఆర్ పేదలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్‌ను ఆదరించాలని కోరారు. ఆయన వెంట గోతి మెర్సన్, తిత్రే విజయ్, సాబ్లే నానక్ సింగ్, ప్రతాప్‌సింగ్, గోతి గులాబ్, సాబ్లే మోహన్, బసీఖాన్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ కాంగ్రెస్ సర్కార్


కరపత్రాలు పంపిణీ చేస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

జైనథ్: కాంగ్రెస్ చేపట్టిన సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిచాయని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం గడప గడపకూ కాంగ్రెస్‌లో భాగంగా బాలాపూర్, ఆకుర్ల, నిరాల గ్రామాల్లో పర్యటించారు. వరంగల్ రైతు డిక్లరేషన్, అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టే పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ, రూ. 15వేల రైతుబంధు అందిస్తామని, రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తామన్నారు. నిరుద్యోగ యువతకు రూ.4వేల నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు షకీల్, రవి, ప్రభాకర్, ముఖీమ్, అజ్మత్ ఖాన్, పొచ్చన్న, కిష్టు, విఠల్, శ్రీనివాస్, మనోజ్, రాజన్న, సంతోశ్, అల్లూరి అశోక్ రెడ్డి, దీపక్‌రావ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

బోథ్: మండలంలోని గుట్టపక్కతండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరినట్లు ఆడె గజేందర్ అన్నారు. ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ద్వారానే బడుగు, బలహీనవర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.500లకు సిలిండర్‌ను అందిస్తామన్నారు. కార్యక్రమంలో గుడాల శేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రఫుల్ చందర్ రెడ్డి, మండల కన్వీనర్ మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, రాజు రెడ్డి, గంగారెడ్డి, బత్తుల రమేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నిధులు మంజూరు

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో మున్నూరుకాపు సంఘం భవనానికి రూ.2 లక్షల 50 వేల నిధులు మంజూరు చేసినట్లు ఎంపీపీ తుల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ప్రొసీడింగ్‌ను సంఘం నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, పిప్పల్దరి సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, అల్లకొండ ప్రశాంత్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ఆదిలాబాద్‌రూరల్: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఆదిలాబాద్ రూరల్ ఎస్సై ఎస్.నాగనాథ్ అన్నారు. సోమవారం మండలంలోని జందాపూర్ జాతీయ రహదారి 44పై వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేసి పలువురిపై కేసులు నమోదు చేశారు. వాహనాలకు నెంబర్ లేకపోయిన, నెంబర్ ట్యాంపరింగ్ చేసిన జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

వినతిపత్రం అందజేత

ఉట్నూర్‌రూరల్: వసతి గృహం సమస్యలు పరిష్కరించంఆలని ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. హాస్టల్‌లో గతకొన్ని నెలల నుంచి నీటి సౌకర్యం లేదని, తాగునీరు లేని దుస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని కోరారు.

రాష్ట్ర కార్యవర్గంలో చోటు

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర మేదరి సంఘం రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా కేంద్రానికి చెందిన పిల్లి కిషన్‌కు చోటు దక్కింది. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఊరే దినేష్, ఊరే గణేశ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

సాహు మహరాజ్ జయంతి

జైనథ్: రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహరాజ్ జయంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్, నాయకులతో కలిసి సాహు మహరాజ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉచిత నిర్బంధ విద్య, కులాంతర, మతాంతర వివాహాలు, జోగిని వ్యవస్థ రద్దు, వంటి ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టిన సంఘ సంస్కర్త సాహు మహరాజ్ అని కొనియాడారు. కార్యక్రమంలో సురేశ్, పొచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామ మాజీ సర్పంచ్ నంది అడెల్లు ఇటీవలే మృతి చెందగా.. సోమవారం బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ జహీర్, ఉప సర్పంచ్ నరేశ్‌రెడ్డి, మందుల రమేశ్, సాబ్లే నానక్ సింగ్, కమలాకర్ రెడ్డి, తులసి దాస్ ఉన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దంతన్‌పల్లి గ్రామ పంచాయతీ ఎంపీటీసీ కొడప అనసూయ ఇటీవల ప్రసూతి కాగా పాప మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ జైవంత్‌రావు, ప్రజాప్రతినిధులు సోమవారం ఆమెను పరామర్శించారు. సర్పంచ్ కళావతి, ఎంపీటీసీ లచ్చు, కోఆప్షన్ సభ్యుడు రషీద్, ఉస్మాన్, బలిరాం, జుగాదిరావు ఉన్నారు.

దరఖాస్తులు సమర్పించాలి

నేరడిగొండ: బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు దానికి సంబంధించిన పత్రాలను సమర్పించాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 5గంటలలోగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

బీపీ కిట్స్ అందజేత

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో తొమ్మిది మంది ఏఎస్ఎంలకు సోమవారం ఆస్పత్రి వైద్యాధికారి రాంబాబు బీపీ కిట్స్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. బీపీ, షుగర్ పరీక్షలు చేసేందుకు ఇది చాలా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఈవో నాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్‌దాస్, సత్తవ్వ, హిమ, అదీప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కురిసిన వాన.. మురిసిన రైతు


రోడ్డుపై నిలిచిన వరద నీరు

ఉట్నూర్‌రూరల్: వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఊరట లభించింది. సోమవారం మధ్యాహ్నం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఉట్నూర్ ప్రధాన కూడలి, రోడ్లు జలమయంగా మారాయి. నడవడానికి సైతం ప్రజలుఇబ్బంది పడ్డారు.

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లో జోరుగా వర్షం కురవడంతో అన్నదాతలు సంబురపడ్డారు. మండలంలోని కప్పర్ల, వడ్డాడి, పొన్నారి, గిరిగాం, అంబుగాం, పొలోది భీంపూర్ మండలంలోని కరంజి, నిపాని, పిప్పల్‌కోటి, వడూర్, అందర్‌బంద్, జల్‌కోరి గ్రామాల్లో పంట చేలలో వరద నీరు నిలిచింది.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం నుంచి వర్షం కురిసింది. విత్తనాలు నాటి వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఇంక విత్తనాలు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. అంతర్గత రోడ్లు చిత్తడిగా మారాయి.

కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కై లాస్‌నగర్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి ఆత్రం నగేశ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. విద్యారంగాన్ని పటిష్టం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్ సోజార్, జుగాది రావు, యాదవ్ రావ్, సుధాకర్, ప్రసాద్, జీవన్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న జిల్లా జడ్జి వరప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా జడ్జి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, తదితర చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు జడ్జి పి.శివప్రసాద్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, కళాశాల సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.